చెరువు.. సంరక్షణ కరువు

- ఆక్రమణకు గురవుతున్న బాపిరాజు చెరువు
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న నిర్లక్ష్యం
- చెరువు స్థలాన్ని పరిరక్షించాలని వినతి
- చెరువు అభివృద్ధి పరచడం లేదా పేదలకు ఇళ్లస్థలాలుగా ఇవ్వాలని డిమాండ్



ఆక్రమణకు గురి అవుతున్న బాపిరాజు చెరువు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న బాపిరాజు చెరువు క్రమేణ ఆక్రమణకు గురవుతోంది. ఈ చెరువును సంరక్షించే బాధ్యత ఎవరికీ పట్టకపోవడంతో ఇష్టారాజ్యంగా ఆక్రమించేస్తున్నారు.

విషయం ఇదీ..

బాపిరాజు చెరువుగా పిలవబడే ఈ చెరువు గ్రామంలోని రెవెన్యూ రికార్డుల ప్రకారం శ్మశానంగా ఉంది. సర్వే నంబర్ 109లో ఉన్న ఈ శ్మశానం 3 ఎకరాల 8 సెంట్లు విస్తీర్ణం ఉండాలి. కానీ ప్రస్తుతం దేవాలయాలు, పశువుల హాస్పటల్, కర్మల భవనం వంటి కట్టడాల ద్వారా కొంత స్థలం ఆక్రమణకు గురైంది. గత కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతంలో వీఆర్వో కార్యాలయం నిర్మాణం పేరిట 5 సెంట్లలో భూమిపూజ కూడా నిర్వహించడంపై అప్పట్లో అభ్యంతరాలు వెలుబుచ్చారు. ఇవే కాక కొంత మంది స్వార్థపరులు చెరువు స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. ఇలా సుమారు ఒక ఎకరం వరకు ఆక్రమణకు గురై ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

నిరు పేదల గృహాలకు కేటాయించాలి

రెవెన్యూ రికార్డుల ప్రకారం శ్మశానంగా ఉన్న ఈ స్థలంలో నిరు పేదల గృహాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు. ఈ స్థలం భవిష్యత్‌లో ఆక్రమణకు గురి అవ్వక మునుపే గ్రామంలోని కాల్వగట్టు ప్రాంతాలు, రెవెన్యూ పోరంబోకు స్థలాల్లో ఏ దిక్కు లేకుండా ఉంటున్న నిరు పేదలకు కేటాయించాలని కోరుతున్నారు. నగరపాలక సంస్థలో జీ+5 నిర్మాణాల మాదిరిగా ఈ స్థలాన్ని పూడ్చించి పక్కా గృహలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఉన్నాతాధికారులు, ప్రజా ప్రతినిధులు నిరు పేదలకు స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానాలు గుర్తుపెట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు.

కొరవడిన చెరువు సంరక్షణ చర్యలు

ఈ చెరువు సంరక్షణ కొరవడటంతో కొత్తగా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. చెరువు స్థలం ఆక్రమణలకు గురి కాకుండా చెరువు మొత్తం పూడిక తీత పనులు నిర్వహించాలని, చెరువు చుట్టూ పెరిగిపోయిన ముళ్ల చెట్లు, కంపలు తొలగించి అభివృద్ధి పరచాలని కోరుతున్నారు. పైగా ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఈ చెరువు పరిసరాల్లో గ్రామంలోని చెత్తను సేకరించి ఇక్కడే డంప్ చేస్తున్నారు. ఈ చెత్తకు నిప్పు పెడుతున్నారని ఫలితంగా దట్టమైన పొగ వ్యాపించి ఇబ్బందులకు గురి అవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో చెత్త సమస్యలపై ఫిర్యాదులు అందడంతో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు చెత్త తొలగింపు చర్యలు తీసుకున్నా పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

త్వరలో అభివృద్ధి చేస్తాం..

చెరువు అభివృద్ధి అంశాన్ని పంచాయతీ పాలకవర్గ సమావేశంలో పెట్టి చర్యలు తీసుకుంటాం. తొలుత చెరువును పూడికతీయించి కట్టలు బలోపేతం చేస్తాం. చెరువు చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేసి పార్కుగా అభివృద్ధి పరచడానికి అంచనాలు రూపొందించాం. ఇటీవల ఈ చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలు తొలగించాం. చెత్తను డంప్ చేయకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

–ఎన్.నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

చెరువును అభివృద్ధి పరచాలి



నిరుపయోగంగా మారిన బాపిరాజు చెరువును అభివృద్ధి పరచాలి. గత కొన్ని సంవత్సరాలుగా పూడికతీతకు నోచుకోకపోవడంతో మురుగునీరు, తూడు చేరింది. చెరువు గట్లు బలోపేతం చేసి చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలి. ఆహ్లాదాన్ని పంచే గ్రీనరీ ఏర్పాటు చేసినట్లయితే ఉదయం, సాయంత్రం సమయాల్లో గ్రామస్తులు సేద తీరడానికి ఉపయోగపడుతుంది. అధికారులు, పాలకులు దృష్టి సారించాలి.

– మహమ్మద్ ఇస్మాయిల్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు, నిడమానూరు

క్లుప్తంగా

12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ టి.స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ శాఖల పనితీరు, పథకాల అమలుపై సమీక్ష జరపనున్నట్లు పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

వైభవంగా శ్రీవారి రాయబారోత్సవం



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీవారికి రాయభారోత్సవం ఘనంగా చేశారు. ఉదయం ఆలమంలో త్రిదిండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో 108 వెండి కలశాలతో శ్రీవారికి పంచామృత స్నపన, అష్టోత్తర శత కలశ స్నపన చేశారు. శ్రీవారికి చందనాలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయంలో శ్రీవారికి తిరుక్కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు



కంకిపాడు: బక్రీద్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. కంకిపాడు పట్టణంలోని బైపాస్ సమీపంలో ముస్లిం పెద్దలు భారీ స్థాయిలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. టెంట్‌లను సిద్ధం చేసి ఉంచారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.

దివ్యాంగుల ఆశ్రమానికి రూ.10 లక్షల విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమానికి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సముద్రాల వెంకట రమణ రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆశాజ్యోతి ఆశ్రమాన్ని సందర్శించారు. శారీరక, మానసిక దివ్యాంగులు, అనాథ బాలలకు ఆశాజ్యోతిలో అందిస్తున్న సదుపాయాలను వెంకట రమణ పరిశీలించారు. ఎంతో ఓర్పుతో దివ్యాంగులు, అనాథ బాలలకు వసతి సదుపాయాలు కల్పిస్తున్న నిర్వాహకులను అభినందించారు. తనవంతుగా ఆశాజ్యోతి ఆశ్రమానికి రూ.10 లక్షల విలువైన చెక్కును అందించారు. భవిష్యత్‌లోనూ తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. భారీ విరాళాన్ని అందించినందుకు ఆశాజ్యోతి వ్యవస్థాపకుడు మరీదు వెంకట స్వామి, కరస్పాండెంట్ మల్లవల్లి మాధవీలత కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సముద్రాల వెంకట రమణ జన్మదినాన్ని దివ్యాంగ చిన్నారుల సమక్షంలో జరుపుకున్నారు. అనంతరం ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుముద్రాల వెంకట రమణ కుమార్తె భానురేఖ, ఇతర కుటుంబ సభ్యులు, ఆంధ్ర హాస్పటల్స్ డైరెక్టర్ కామినేని అచ్యుత్ బాబు, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం వెంకటేశ్వరరావు (స్వామి) పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జాస్తి



కంకిపాడు శాఖా గ్రంథాలయంలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో బహుమతులు స్వీకరించిన విద్యార్థులు



ముస్తాబాదలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా క్రీడా, పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పుణ్య ఛారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ బహుమతులను అందజేశారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు, సిబ్బందికి, హాజరైన విద్యార్థులకు గ్రంథాలయ అధ్యక్షుడు నర్రా సీతారామరావు అభినందించారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, కమిటీ సభ్యులు చిమట రామారావు, విశ్రాంత ఉద్యోగి ధర్మారావు, లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభలో ఏపీ పౌర గ్రంథాలయాల డైరెక్టర్ కృష్ణమోహన్ హాజరై ప్రసంగించారు. గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజ్ఞానాన్ని సముపార్జించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయంలో వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్, గ్రంథాలయాధికారి ఎస్.సునీత, స్థానికులు పాల్గొన్నారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు ఎం.మల్లేశ్వరరావు, జాన్సన్, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, న్యాయవాది కృష్ణ, టి.శేషుబాబు, కె.రాంబాబు, ఎం.శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలి

పెనమలూరు: గ్రంథాలయాల సేవలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వణుకూరు గ్రామ సర్పంచి చెక్క విజయ అన్నారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు శుక్రవారం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గ్రంథాలయాలకు వచ్చి వివిధ రకాలు పుస్తకాలు చదవటం వలన విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో గ్రంథాలయాలలో జరిగిన అనేక కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనటం వలన ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. కాగా గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, చిన్నారులకు సర్పంచి విజయ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి భారతి, గ్రామ పంచాయతీ ,సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు సభ జరిగింది. లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విజేతలను గ్రామ పెద్దలు బహుమతులు పంపిణీ చేశారు. పుస్తక పఠనంతో పాటు గడచిన 40 రోజులుగా వివిధ ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను గ్రంథాలయాలకు తరచూ తీసుకురావాలని ఆకాంక్షించారు. సిబ్బంది పాల్గొన్నారు.

9న మంద కృష్ణమాదిగ రాక

నున్న(విజయవాడరూరల్): ఈ నెల 9న మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ రానున్నారని గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ బాధ్యులు మంద వేణుమాదిగ తెలిపారు. చిక్కవరం శివారు చింతకుంటలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మాదిగలు జయప్రదం చేయాలన్నారు. కోటా కృష్ణ మోహన్ మాదిగ, చిల్లిముంత కోటేశ్వరరావు మాదిగ, తగరం సుబ్బారావు మాదిగ, తగరం విజయ్‌కుమార్ మాదిగ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ మండల కమిటీ, మున్సిపాలిటీ కమిటీలను నియమిస్తూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొంది. పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని కమిటీల వివరాలను వెల్లడించింది.

కంకిపాడు మండల కమిటీ

మండల ఉపాధ్యక్షులుగా టెక్కెం సతీష్, కోనా కిషోర్, ప్రధాన కార్యదర్శులుగా భీమవరపు నాగిరెడ్డి, బందెల సుబ్బారావు, షేక్ అబ్దుల్లా, యలమంచిలి రామినీడు, ఆరుగురు కార్యదర్శులు, మరో 24 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

పెనమలూరు మండల కమిటీ

మండల ఉపాధ్యక్షులుగా వణుకూరు నాగరాజు, అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శులుగా షేక్ పీర్‌అహ్మద్, లంకె సుబ్బారావు, కొత్తా శ్రీనివాసరావు, చిట్టూరి సుబ్బారావు, కార్యదర్శులు ఆరుగురు, మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు.

ఉయ్యూరు మండల కమిటీ

మండల కమిటీ ఉపాధ్యక్షుడుగా గారపాటి నాని, ఆరేపల్లి రజని, ప్రధాన కార్యదర్శులుగా కొండూరి ఆనంద అమృతరాజు, గొనగంటి సాంబశివరావు, తూమాటి గిరీష్, జొన్న కాంతారావు, త్రిపురం చంద్రశేఖర్, కార్యదర్శులు ఆరుగురు, మరో పది మంది కమిటీ సభ్యులుగా మండలానికి నియమితులయ్యారు.

ఉయ్యూరు నగర పంచాయతీ కమిటీ

ఉయ్యూరు నగర పంచాయతీ కమిటీ ఉపాధ్యక్షులుగా పెనుమూడి సంజయ్, జంపాన రవి, ప్రధాన కార్యదర్శులుగా కూనపరెడ్డి ఓంకారం, నిమ్మకూరి అవినాష్, వీర్ల వెంకట సత్యనారాయణ, వి.శ్రీను, కార్యదర్శులు ఆరుగురు మరో 19 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిటీ

వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిటీ ఉపాధ్యక్షులుగా యార్లగడ్డ వీరబాబు, బొర్రా శివాజీ, ప్రధాన కార్యదర్శులుగా బొర్రా కృష్ణ, సంతోటి శ్రీను, కాసాని ఫణీంద్రకుమార్, ఎండీ జిన్నా, ఎం.డి. చాంద్‌బాషా, కార్యదర్శులుగా పదిమంది, మరో 38 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

యాంటిబయోటిక్స్ అవసరానికి మించి వాడితే ప్రమాదం

వైద్య విద్యార్థులకు నిపుణుల దిశానిర్దేశం



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో డీజీ డాక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్

గన్నవరం రూరల్: మండలంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో శుక్రవారం యాంటిమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పై ఫ్రంట్ లైన్ వర్క్‌షాప్ జరిగింది. డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు టెలిమెడిసిన్ హాల్‌లో జరిగిన సదస్సులో సోనీపట్ అశోక యూనివర్శిటీ రీసెర్చ్ ఫ్యాకల్టీ ఫెలో డాక్టర్ శ్రద్ధా కార్వే, మైక్రోబయాలాజికల్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీవల్లి భాగవతుల, హైదరాబాద్ మాగ్న సెంటర్స్ పిడియాట్రీషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ ముఖ్యవక్తలుగా పాల్గొని దిశా నిర్దేశం చేశారు. అవసరానికి మించి యాంటిబయోటిక్స్ మందులు వాడకం ప్రమాదకరమని, భావి వైద్యులు దీన్ని గుర్తించాలన్నారు. సరైన కోర్సు మందులు వాడకపోతే బ్యాక్టీరియా రూపాంతరం చెందడానికి ప్రయత్నిస్తుందన్నారు. అందుకే రోగులకు మందులు ఇచ్చేటప్పుడు సూక్ష్మపరిశీలనలు అన్ని విధాలుగా జరగాలన్నారు. ఒక వేళ అవి పనిచేయకపోతే హైయ్యర్ యాంటిబయాటిక్స్‌కు వెళ్లాల్సి ఉంటుందని, అది కూడా కాకపోతే నెక్స్ట్ లెవెల్ వైద్యం అందించాల్సి వస్తుందని, ఈ పరిస్థితుల నివారణకు కచ్చితమైన నిర్ధారణ ముఖ్యమన్నారు. యాంటిబయోటిక్, యాంటి ఫంగల్, యాంటి వైరస్ మందులను అనవసరంగా వాడడాన్ని నిరోధించాలన్నారు. కరోనా తరువాత అనవసరమైన యాంటిబయాటిక్స్ వాడకంతో యాంటిమైక్రోబియల్ రెసిస్టెన్స్ పరిస్థితులు చూస్తున్నామన్నారు. ఈ పరిస్థితి నివారణకు అందరం లక్ష్యంతో పని చేయాలని పేర్కొన్నారు. యాంటిబయోటిక్స్ సరైన వాడకం, నిర్లక్ష్యం, దుష్ఫలితాలపై అవగాహన నిర్వహించారు. వైద్య విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఏఎంఆర్ విస్తరణ నిరోధించటం వైద్యుల బాధ్యత, లక్ష్యంగా గుర్తించాలన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేజర్ ఎంవీ భీమేశ్వర్, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ స్వాతి పూర్ణిమ, డాక్టర్ వి.కళ్యాణ్ చక్రవర్తి, హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం



కిశోర బాలికలతో సర్పంచి విజయ

పెనమలూరు: క్రీడల్లో పాల్గొనటం వలన కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని వణుకూరు గ్రామ సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకురాలు చెక్క విజయ అన్నారు. వణుకూరు గ్రామంలో శుక్రవారం కిషోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంప్‌లో శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి విజయ మాట్లాడుతూ శారీరక వ్యాయామం వలన కండరాలు, గుండె పని తీరు మెరుగుపడి, శరీర బరువు నియంత్రణలో ఉంటుందన్నారు. క్రీడల వలన ఒత్తిడి తగ్గి మానసిక ఆరోగ్యం బాగా ఉంటుందని వివరించారు. చిన్నారులు చదువుతో పాటు ఆట పాటల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి టి.లత, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి డి.వికల్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలబాలికలు పాల్గొన్నారు.

ఎస్టీయూ సీనియర్ నేత ప్రభాకర్‌రావు మృతి



కంకిపాడు: ఎస్టీయూ సీనియర్ నేత, హెచ్‌ఎం ముల్లంగి ప్రభాకర్‌రావు (58) శుక్రవారం ఉదయం గుండెపోటుతో కంకిపాడులోని తన నివాసంలో మృతి చెందారు. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఉంగుటూరు మండలం ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొద్దిరోజుల క్రితం వచ్చారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభాకర్‌రావు గతంలో ఉంగుటూరు విద్యాశాఖ అధికారిగా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. ప్రభాకర్‌రావు మృతి విషయం తెలుసుకున్న ఎస్టీయూ నేతలు పీకా ఇమ్మానుయేలు, కొమ్ము ప్రసాద్, మండవ గౌరీప్రసాద్, దేవరపల్లి విద్యాసాగర్, యు.టైటస్‌పాల్, అద్దేపల్లి విజయ్‌కుమార్, పచ్చిగళ్ల సురేష్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, జల మోహన్‌గాంధీ, పరసా ఆనందరావు తదితరులు ప్రభాకర్‌రావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామమైన చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి తరలించారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

సూరంపల్లిలో చెరువు మట్టి తవ్వకం వివాదాస్పదం



పురుషోత్తపట్నంలో మట్టి తవ్వకాలు

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మట్టి తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వీరపనేనిగూడెం, ముస్తాబాద, పురుషోత్తపట్నం, చిక్కవరం గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు జోరుగా మట్టిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

వెంచర్లకు..

వెంచర్‌లకు మట్టి తరలిపోతోంది. అధికారం అండతో, అధికారుల మద్దతుతో ప్రశ్నించే వారికి కనీసం సమాధానం చెప్పకుండా మట్టిని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వీరపనేనిగూడెంలో ఇటుక బట్టీల వ్యాపారం కోసం మట్టి బ్యాంకులు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీలోనే రోజు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఇటీవల వీరపనేనిగూడెంలో రెండు రోజులు మట్టి తవ్వకాలు నిలిపివేశారు. చెరువులలోని తూముల ద్వారా సాగునీరు బయటకు వెళ్లాల్సి ఉండగా, ఆ విషయం విస్మరించి తవ్వకాలు చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఒంటిపై కిరోసిన్ పోసుకుని..

సూరంపల్లిలో శుక్రవారం చెరువు మట్టి తవ్వకాలు వివాదాస్పదమయ్యాయి. ఎంతో కాలంగా సాగుచేసుకుంటున్న అబ్దుల్లా అనే రైతు మట్టి తవ్వకాలు అడ్డుకోవటంతో పాటు ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో తవ్వకం దారులు, అధికారులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు..

వీరపనేనిగూడెం ములకలమ్మ చెరువు, చిక్కవరం సొబ్బన్న చెరువు, పురుషోత్తపట్నం ఊర చెరువు, ముస్తాబాద పెద చెరువులో మట్టి తవ్వకాలు అక్రమంగా కొన సాగుతున్నా చెరువుల అధికారులు, రెవెన్యూ శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

అధికారులు ఇలా..

ఈ విషయంపై తహసీల్దార్ కేవీ శివయ్యను వివరణ కోరగా సూరంపల్లి విషయం తనకు తెలియదని, రైతులు అర్జీ ఇస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్‌ను వీరపనేనిగూడెంలో మట్టి బ్యాంకులు ఏర్పాటుపై, అక్రమ మట్టి తరలింపుపై వివరణ కోరగా మట్టిని అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని, తవ్వకాలు నిలిపివేస్తామని చెప్పారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి అవసరం

ఘంటసాల కేవీకే సమన్వయకర్త సుధారాణి



వణుకూరులో మాట్లాడుతున్న సుధారాణి

పెనమలూరు: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టి సారించాలని ఘంటశాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. వణుకూరు గ్రామంలో శుక్రవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. రైతులు అధిక దిగుడులు ఇచ్చే వరి విత్తనాలతో సాగు చేయాలని సూచించారు. తక్కువ ఖర్చుతో సాగు చేయాలని, ముఖ్యంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని తెలిపారు. సాగు వెలకువలు రైతులు వ్యవసాయ అధికారులతో సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజేవాణి మాట్లాడుతూ ఉద్యాన పంటలైన కూరగాయాలు, పసుపు, కంద, ఆయిల్‌పామ్ పంటలకు అధిక దిగుగుబడులు వచ్చే రకాలు సాగు చేయాలని అన్నారు. మట్టి నమూనాలు, విత్తనాల భ్యత, నేల ఆరోగ్యాన్ని అనుసరించి పోషక యాజమాన్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కల్యాణ్ బాబు, డాక్టర్ లహరి, ఉద్యాన అధికారి చందు జోసెఫ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గ్రామంలోని ఈఎస్ఐ కాలువ కట్టకు చెందిన కొత్తూరి రమేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను గురువారం గంగూరు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి భీమవరం వైపునకు వెళుతున్న ఆర్టీసీ బస్సు రమేష్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో రమేష్ తలకు గాయాలు అయ్యాయి. అతని చెవుల నుంచి రక్తం వచ్చింది. అపస్మారకస్థితిలో ఉన్న అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్సకై చేర్చారు. బాధితుడి తల్లి ఝాన్సి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.